ఎస్సార్బీసీకి గండ్లు... సాగుకు ఇక్కట్లు !

- ఆలమూరు చెరువుకు ఉధృతంగా గండ్ల నీరు
- పదేళ్లుగా సాగుకు నోచుకోని 350 ఎకరాలు
- నిరంతరం అలుగు పొంగుతున్న వైనం
- బీళ్లుగా మారాయని రైతుల ఆవేదన... పట్టించుకోని అధికారులు

పాణ్యం: ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు కొందరు అక్రమార్కులు(నానాయకట్టు) గండ్లు పెట్టడంతో ఆలమూరు చెరువు అలుగు కింద ఆయకట్టు రైతులు అన్యాయం జరుగుతుంది. వారి భూములు ఏకంగా సాగుకే పనికిరాకుండా పోతున్నాయి. దాదాపు పదేళ్లుగా సాగుకు నోచుకోవడం లేదు అలుగు కింద ఉన్న భూముల రైతులు. నీరు అధికమై పొలాలు బీళ్లుగా మారాయి. వీరిలో దళితులు, బీసీల రైతులే అధికంగా ఉన్నారు. కొన్నేళ్లుగా రైతులు చేస్తున్న పోరాటాలు అన్ని ఇన్నీ కావు. కాల్వలకు గండ్లు పూడ్చాలని రైతులు పదేపదే ఎస్సార్బీసీ అధికారులకు వినతులు సమర్పించినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దాదాపు 350ఎకరాలకు పైగా సుమారు 200కు పైగా రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రతిసారి అధికారులకు విన్నవించడం... వారు వచ్చి చూడడం వెళ్లడం.. తప్పా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



నేటికి కాల్వ కింద వాగులో ప్రవహిస్తున్న నీరు



ఆలమూరులో బీళ్లుగా మారిన పొలాలు

గండ్లతో నిరంతరం నీటి ప్రవాహం...

కొందరు అక్రమార్కులు అటవీశాఖ పరిధిలో కొండపై మట్టిపోసి పొలాలను చేసుకున్నారు. ఈ పొలాలకు నీటి కోసం ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు ఆలమూరు గ్రామ పరిధిలో నానాయకట్టు నాలుగు గండ్లు కొట్టారు. అయితే ఈ నాలుగు గండ్లు ఆలమూరు చెరువుపైన ఉండడంతో సమస్య తీవ్రమైంది. కాల్వలకు నీరు విడుదల చేసినప్పుడల్లా(ఖరీఫ్, రబీ)కాలంలో నాలుగు గండ్ల నుంచి వచ్చే నీరు ఎకమై ఆలమూరు చెరువులోకి చేరుతున్నాయి. అలుగు ద్వారా దిగువన ఉన్న పొలాలో 24 గంటలు ప్రవహిస్తున్నాయి. దీంతో ఏళ్లతరబడి ఆయకట్టుకు సాగు అనే మాటే లేదు... విలువైన సాగునీరూ వృథా అవుతూనే ఉంది. తమ పొలాలు హద్దులు ఎక్కడున్నాయనే తెలుసుకోనంతగా వీపరితమైన గడ్డి, ముళ్లకంపలతో నిండిపోయాయి. ఏ పొలంలో చూసిన రెండు నుంచి మూడు అడుగుల నీరు ప్రవహిస్తుంది. కేవలం కొందరు అక్రమార్కుల కారణంగా దిగువన ఉన్న రైతులకు అధిక నీరు శాపంగా మారింది. ఈ సమస్యపై రైతులు పలుమార్లు కలెక్టర్, ఎస్సార్బీసీ కార్యాలయాల మెట్లెక్కినా ప్రయోజనం శూన్యంగా మారింది.



ఎస్సార్బీసీ ప్రధాన కాల్వలకు గండ్లు కొట్టిన దృశ్యం



కొర్ణపాయ వాగుపై ఎర్పడిన గండి

గండ్లు పూడ్చితే సమస్యకు పరిష్కారం

అధికారులు క్షేత్ర స్థాయిలో కఠిన చర్యలు తీసుకుని గండ్లను పూడ్చితేనే సమస్య పరిష్కారం అవుతుందని బాధిత రైతులు విన్నవిస్తున్నారు. అధికారులు అనుకుంటే కనీసం కరీఫ్కైనా తమ భూములు సాగులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సార్బీసీ బ్లాక్ ద్వారా, చెరువు ద్వారా సాగునీరు పుష్కలంగా ఉందని రైతులు చెబుతున్నారు. ఈ నీటితో ప్రతి రైతులకు నీరు అందుతాయని, ఇంత వరకే పరిమితం చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న గండ్ల వద్ద రైతులే బస్తాలు అడ్డువేసినా రాత్రి వేళల్లో అక్రమార్కులు తొలగిస్తున్నారని రైతులు వాపోయారు. అధికారులు గండ్లకు శాశ్వతంగా కాంక్రీట్ వేసి పూడ్చాలని కోరుతున్నారు.

పొలంలో కంపచెట్లు పెరిగాయి



నాకు ఎనిమిదెకరాల పొలం ఉంది. పదేళ్లుగా పొలం బీడుగా మారింది. ఎప్పుడు చూసినా పొలంలో వీపరితమై నీరు ప్రవహిస్తుంది. దాదాపు మూడు అడుగులపైనే నీటి ప్రవాహం ఉంది. పొలాల హద్దులు ఎక్కడున్నాయనే విషయం అర్థం కావడం లేదు. పొలాలు మొత్తం కంపచెట్లు, గడ్డితో నిండిపోయాయి. కాల్వలకు గండ్లు పూడ్చాలని అధికారుల తిరుగుతూనే ఉన్నాం. అధికారులు స్పందించిన న్యాయం చేయాలి. – సగినెల సుబ్బరాయుడు, బాధిత రైతు, ఆలమూరు

చర్యలు తీసుకుంటాం

ఆలమూరు రైతులు మా దృష్టికి సమస్యను తెచ్చారు. పరిష్కారం కోసం డీఈఈ స్థాయి అధికారి క్షేత్ర స్థాయిలో సమస్యను గుర్తించారు. కాల్వకు నీరు పూర్తిగా తగ్గితే గండ్లు పూడ్చి రైతులు ఇబ్బంది లేకుండా చూస్తాం. గండ్లు కొడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం. ఏ రైతుకు ఇబ్బంది లేకుండా...సాగునీరు వృథా కాకుండా చూస్తాం.
–ఈఈ మాధవరావు, (కాడా విభాగం)

క్లుప్తంగా

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి



కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న ఏపీఓ లక్ష్మన్న

సి.బెళగల్: ఉపాధి హామీ పనులను రైతు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ లక్ష్మన్న సూచించారు. మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో జరుగుతున్న పంటల కాలువల పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ పనుల దగ్గర వసతులు, సౌకర్యాలను కూలీలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించి పనుల నిర్వహణపై మేటీలకు సూచనలను చేశారు. వేసవి నేపథ్యంలో కూలీలు ఉదయం త్వరగా పనులకు వచ్చి దినసరి వేతనం రూ.272లు వచ్చేలా కొలతలతో చేసుకోవాలని సూచించారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఏపీడీ బాలాజీ నాయక్

గడివేముల: ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏపీడీ బాలాజీ నాయక్ హెచ్చరించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఏపీడీ మాట్లాడారు. ప్రతి జాబ్ కార్డుకు ఆధార్ నంబర్‌ను లింకు చేయాలన్నారు. గ్రామంలో లేనివ్యక్తులు, చనిపోయిన, డబల్ ఎంట్రీ ఉన్న బాబ్ కార్డులను తొలగించాలన్నారు. ప్రజలు, రైతులకు అవసరమైన పనులు చేయాలన్నారు. ఉపాధి పనులకు హాజరైన వారిని మాత్రమే మస్టర్‌లలో నమోదు చేయాలన్నారు. వేసవి నేపథ్యంలో పనుల వద్ద కూలీలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని సదుపాయాలు కల్పించాలని ఏపీఓ వెంకటరమణను ఆదేశించారు.

నేడు జూలకల్‌లో గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ నిర్వహించనున్నట్లు మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు దామోదర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటింటికీ ఎమ్మెల్యే తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటారన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతు ఆత్మహత్యలపై ఆర్డీఓ విచారణ



రైతు ఆత్మహత్యలపై విచారిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

కోడుమూరు రూరల్: మండలంలోని అనుగొండ, గోరంట్ల గ్రామాల్లో 2022లో రైతులు వెంకటేశ్వర్లు, సద్దల మద్దిలేటి, గుండెన్న ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ మేరకు మంగళవారం వీరి ఆత్మహత్యలపై కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ ఆయా గ్రామాల్లో పర్యటించి విచారణ చేశారు. ఆర్డీఓ వెంట కోడుమూరు తహసీల్దార్ శేషఫణి, ఏఓ రవి ప్రకాష్, రెవెన్యూ, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ



పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ హరిప్రసాద్

గూడూరు: కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ మంగళవారం పట్టణంలో పర్యటించారు. ముందుగా ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సమస్యలపై తహసీల్దార్ రామాంజనేయులుతో చర్చించారు. అనంతరం ఆర్టీసీ కర్నూలు డిపో అధికారులు స్థానిక కొత్త బస్టాండ్ దగ్గర పెట్రోల్ బంకు ఏర్పాటుకు పెట్టుకున్న దరఖాస్తు మేరకు ఆ స్థలాన్ని ఆర్డీఓ పరిశీలించారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో నిల్

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ కు మంగళవారం ఇన్ ఫ్లో నిలిచి పోయింది. డ్యామ్‌లో 1.194 టీఎంసీల నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

సి.బెళగల్: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని, ఆ దిశంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. మండలంలోని ముడుమాల గ్రామ పంచాయతీలో రెండవ రోజు మంగళవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఇంటిటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేశారు. పెరాలసిస్ బాధితుడు సురేంద్రబాబుకు ఎమ్మెల్యే వైద్య సుచనలను ఇచ్చి ధైర్యం చెప్పారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను అధికారులతో నమోదు చేయించిన ఎమ్మెల్యే వాటిని వీలైంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామస్తులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాకా రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని, సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి దాదాపుగా లక్ష నుంచి మూడు లక్షల రూపాలయల వరకు లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. ప్రజలకు నేరుగా పెద్ద ఎత్తున సంక్షేమ ఫలాలు ఇళ్లకే చేరుతున్నాయన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు వైఎస్సార్ సీపీని మరోమారు ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను కోరారు. ఎస్సీ కాలనీలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, కొత్త కాలనీలలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాల సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంతల మునెప్ప, జెడ్పీటీసీ సభ్యుడు గిరిజోను, వైస్సార్‌సీపీ మండల నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీడీఓ రాముడు, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, పంచాయతీ కార్యదర్శులు రాజేష్, సుధాకర్, వీఆర్వో అక్బర్, వైస్సార్ సీపీ నాయకులు జగదీశ్వరరెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యమే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: జాతిపితా మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యామే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తడకనపల్లె గ్రామ సచివాలయ భవనాన్ని ఎంపీపీ బోయ శారద, జెడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థలను ఏర్పాటు చేసి రాష్ట్రంలో నూతన శకానికి నాంది పలికారన్నారు. వీటి ఏర్పాటుతో రాష్ట్రంలో సుమారు 2.30 లక్షల మంది నిరుద్యోగులకు శాశ్వతంగా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారన్నారు. ప్రతి గ్రామ/వార్డు సచివాలయంలో పది మంది శాశ్వత ఉద్యోగులను నియమించామన్నారు. గ్రామాల సమస్యలు అక్కడనే పరిష్కారమవుతున్నాయన్నారు. గ్రామాల్లో సచివాలయాలు ఉండడంతో ప్రజలు గతంలో మాదిరిగా మండల కేంద్రాలకు వెళ్లే వ్యయప్రయాసలు తప్పాయన్నారు. ప్రజలకు కావాలసిన అన్ని సేవలు అందుబాటులోకి తీసుకువచ్చామని, కుల, ఆదాయ ధృవీకరణ, 1–బీ, అడంగల్, ఆర్ఓఆర్ వంటి భూముల పత్రాలు గ్రామ సచివాలయంలో అందుబాటులోకి తీసుకోవచ్చాన్నారు. విద్యార్థులకు, రైతులకు అవసరమైన సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలకు అవసరమైన పత్రాలు అప్‌లోడ్ అన్ని సచివాలయాల్లోనే జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ సహేరాబీ, ఎంపీటీసీ మధుసూదనమ్మ, గ్రామ నాయకులు సోమన్న యాదవ్, కృష్ణరెడ్డి, వీసీ స్వాములు, రామిరెడ్డి, దామోదర్‌రెడ్డి, ధనలక్ష్మి, బొజ్జమ్మ, తహసీల్దార్ టీవీ రమేష్ బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్ రెడ్డి, పీఆర్ ఏఈ అచ్యుతానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తడకనపల్లె గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఆన్‌లైన్ ద్వారా హాల్ టిక్కెట్ పొందండి

ఓర్వకల్లు: గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20 వ తేదీన జరిగే ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్ టిక్కెట్‌ను పొందాలని కాల్వబుగ్గ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాలిబాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షలు 5,6,7,8 తరగతులకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, కళాశాలలకు సంబంధించి మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు htt pr// a prr.a pcfrrin అనే వెబ్‌సైట్ నుంచి అభ్యర్థుల ఐడీ, పుట్టిన తేదీ సహాయంతో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి హాల్ టిక్కెట్లు అందుబాటులో వున్నాయన్నారు. సమయానికి గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. బ్లూ/బ్లాక్ బాల్‌పాయింట్ పెన్నుతో పాటు హెబీ పెన్సిల్‌ను వెంట తెచ్చుకోవాలన్నారు. సెల్ ఫోన్‌లు, క్యాలికులెటర్, స్మార్టు వాచ్‌లను అనుమతించమని తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

కల్లూరు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు, వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా, పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కర్నూలు డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) పి.బాలకృష్ణరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిన్నటేకూరు, ఉలిందకొండ గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేసి రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బడిబయట పిల్లలను సర్వే చేసి వివరాలను నమోదు చేయలన్నారు. గర్భిణులు, బాలింతలు, యుక్త వయసు బాలికలలో రక్తహీతన ఉన్న వారిని గుర్తించి అదనపు పోషకాహారం తీసుకునేల అవగాన కల్పించాలన్నారు. బాల్య వివాహలపై పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించి బాల్య వివాహ నిషేధ చట్టం గురించి వివరించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి రోజు 3 నుండి 5 వరకు స్పందన కార్యక్రము నిర్వహించాలని, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సర్వేను పూర్తి చేయాలన్నారు.



ఉలిందకొండ సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో బాలకృష్ణరెడ్డి

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద ఎస్సీ, ఎస్టీ రైతులకు, వైఎస్సార్ జలకళ, ఇందిర జల ప్రభ వంద శాతం సబ్సిడీపై పండ్ల తోటల సాగుకు అవకాశం కల్పిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం మండలంలోని ఎర్రదొడ్డి, గోరంట్ల గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను ఎంపీడీఓ పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో సన్న,చిన్న కారు రైతులను గుర్తించి పండ్ల తోటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులకు 5ఎకరాల్లోపు భూమికి మించకుండా నీటి వసతి కలిగివుండాలని, గతంలో ఉపాధి, ఉద్యానవన శాఖ నుంచి లబ్ధి పొందని రైతులు, జాబ్‌కార్డు కలిగివున్న వారు అర్హులని ఎంపీడీఓ సూచించారు. అనంతరం ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆయా గ్రామాల్లోని గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను, సిబ్బంది హాజరును పరిశీలించి సూచనలిచ్చారు. ఎంపీడీఓ వెంట ఏపీఓ రమాదేవి ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

భూముల రీ సర్వేను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం 'మీ భూమి–మా హామీ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని హుసేనాపురం, కన్నమడకల, లొద్దిపల్లెలో గ్రామ సభలు నిర్వహించి రీ సర్వే ఆవశ్యకత, ప్రయోజనాలను గూర్చి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వంద ఏళ్ల తర్వాత గ్రామ కంఠం స్థిరాస్తులను సర్వే చేయనున్నట్లు తెలిపారు. తద్వారా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా కొత్త పాసుపుస్తకాలు జారీ అవుతాయన్నారు. రైతులు తమకు సంబంధించిన భూ రికార్డులతో తమ పొలాల వద్దకు చేరుకోవాలని సూచించారు. సర్వే బృందాలు తమ భూములను సర్వే చేసి, హద్దులను చూపిస్తారన్నారు. గ్రామ సభల్లో మండల సర్వేయర్ జయరాముడు, ఈఓఆర్డీ సుబ్బరాయుడు, సర్పంచులు చంద్ర గోవర్ధనమ్మ, వడ్డె పెద్ద కాశిమన్న, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి

312 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులు

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కీలక పాత్ర పోషిస్తున్న వలంటీర్లను సన్మానించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ, వార్డు సచివాలయాలకు, ప్రజలకు వారధిలా పనిచేస్తున్న వీరి సేవలకు గుర్తుగా ఈ నెల 19వ తేదీ నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో వీరిని సన్మానించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కర్నూలు మండలంలో 312 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులకు, మరో 5 మంది వలంటీర్లకు సేవా రత్న అవార్డులు అందించనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయవాడలో ఈ కార్యక్రమాన్ని అదే రోజు ప్రారంభించనున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర కేటగిరీగా ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకంగా నగదును అందించేందుకు నిర్ణయం తీసుకుంది. సేవా మిత్రలుగా ఎంపికైన వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు, సేవా రత్నకు రూ.20 వేలు, సేవా వజ్రగా ఎంపికైన వారికి రూ.30 వేలను రివార్డుగా అందించనున్నారు. నగదుతో పాటు ప్రశంసా పత్రం, శాలువా, బ్యాడ్జీ, మెడల్స్‌ను అందించనున్నారు.

ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

గూడూరు రూరల్: మండల పరిధిలోని జూలకల్ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం ప్రిన్సిపాల్ దిల్షాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లు ఉన్నాయని. ఈ నెల 25లోపు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి పాఠశాలలో సంప్రదించాలని, 11.06.2023న దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ రాత పరీక్షను నిర్వహించనున్నామని ఆమె తెలిపారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ రమణ ప్రజలకు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో జూన్ 11 వరకు కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, చిత్ర లేఖనం, పేపర్ ఆర్ట్ తదితర సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సి.బెళగల్ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్న లైబ్రేరియన్ రమణ

వ్యక్తిగత పరిశుభ్రతోనే ఆరోగ్యం



గడివేములలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే రోగాలు ధరిచేరవని డాక్టర్ మొల్లా జబీన్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి బస్టాండు వరకు జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది వేణుగోపాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, ఉత్తయ్య, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

- కర్నూలు (న్యూటౌన్): మండలంలోని ఈ తాండ్రపాడు గ్రామంలో డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. అధికారులు, ఏఎన్ఎంలతో కలిసి ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగన్నాథం, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.
- గూడూరు: డెంగీ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ కృష్ణారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రాఘవయ్య, మెప్మా సీఎంఓ సూర్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య కార్యర్తలు పాల్గొన్నారు.
- సి.బెళగల్: స్థానిక పీహెచ్‌సీలో జరిగిన డెంగీ దినోత్సవంలో వైద్యులు, వైద్య సిబ్బందితో డాక్టర్ మిథున్ రెడ్డి ప్రతిజ్ఞ చేయించారు. ఆయుష్ డాక్టర్ ప్రసారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదినారాయణ ఉన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఎల్లమ్మ ఆలయం



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ



అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు

కర్నూలు (న్యూటౌన్): జిల్లా నలుమూలల నుంచి భక్తులు వెంకాయపల్లె ఎల్లమ్మతల్లిని దర్శించుకునేందుకు మంగళవారం తరలిరావడంతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మ తల్లీ చల్లగా దీవించమ్మా అంటూ వేడుకున్నారు. నూతన వధూవరులు అమ్మవారిని దర్శించుకుని గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఉదయం పూజారులు అమ్మవారికి జలాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలు, ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కలుగజేశారు.

విజయవాడకు తరలిన భక్తులు

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విజయవాడలో చేపట్టిన శ్రీ లక్ష్మీ యజ్ఞానికి పాణ్యం మండలం కొత్తూరులో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాస్థనం తరుపున భక్తులను వెళ్లినట్లు ఆలయ అధికారులు తెలిపారు. మంగళవారం రాత్రి ఆర్టీసీ బస్సులో భక్తులు విజయవాడకు వెళ్లారన్నారు. బుధవారం నిర్వహించే హోమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని, తదనంతరం భక్తులు తిరుగుప్రయాణం అవుతారన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం

గడివేముల: ఎస్ఆర్‌బీసీ లైనింగ్ కోసం తిరుగుతున్న భారీ వాహనాలతో రోడ్డు దెబ్బతింటోందని బొల్లవరం సర్పంచ్ యేలంపల్లె అంజనమ్మ మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. లారీలలోని కంకర రోడ్డుపై పడటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందని, తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని, ఇదే విషయాన్ని గత నెల 24న నంద్యాల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కాగా అధికలోడుతో వెళ్తున్న లారీని సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.